## క్లుప్తంగా

### ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు

కంచరపాలెం: ఆంధ్ర బౌద్ధ సమాజ కేంద్రం నేతృత్వంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నట్లు కేంద్రం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో సెప్టెంబర్ 1 నుంచి 90 రోజుల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 96760 30455 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### అలరించిన సంగీత విభావరి

సీతంపేట: నటరత్న కల్చరల్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు భయ్యా శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాయనీ గాయకులు విజయ, రమణి, ప్రభాకర్, మంజుల తదితరులు ఎన్టీఆర్ నటించిన చిత్రాల్లోని పాటలు పాడి ఆహుతులను ఉర్రూతలూగించారు.

### 15వ వార్డులో అన్నదానం

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెంలో కనకమ్మ అమ్మవారి జాతరలో భాగంగా ఆదివారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

### ఇబ్బందికరంగా వాహనాల పార్కింగ్



బాలయ్యశాస్త్రి లేఅవుట్ రోడ్డుపై నిలిపిన వాహనాలు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని అభయ ఆంజనేయ స్వామి ఆలయ ఆర్చి రోడ్డులో ఇరానీ టీ షాపు వద్ద ఇబ్బందికరంగా వాహనాలు నిలిపివేస్తున్నారు. ప్రతి రోజు ఇక్కడ ఇదే పరిస్థితి నెలకొంటుంది. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలను ఇష్టానుసారంగా పార్క్‌చేసి వదిలేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగి ఇతర వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





# మెరిసిపోతున్న రహదారులు



నందగిరినగర్‌లో కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డు



దాడి రామ్మూర్తి కల్యాణ మండపం రహదారి

- 43వ వార్డులో బీటీ రోడ్ల నిర్మాణం
- చకచకా అభివృద్ధి పనులు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డులో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. ఇక్కడ నిర్మిస్తున్న రహదారులు మెరిసిపోతున్నాయి. పెద్దిశెట్టి ఉషశ్రీ కార్పొరేటర్‌గా ఎన్నికైన నాటి నుంచి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చి వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. రూ.1.23 కోట్ల వ్యయంతో వార్డు పరిధిలో ఏడు ప్రధాన రహదారుల్లో బీటీ రోడ్ల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఈ పనుల కోసం ఈ నెల 22న శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. పనులు ప్రారంభించిన ఐదు రోజుల్లో బీటీ రోడ్ల నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. ఈ నిధులతో 80 ఫీట్ రోడ్ నుంచి చెక్కుదురాయి బిల్డింగ్ వరకు, దాడి రామ్మూర్తి కల్యాణ మండపం ముందున్న రహదారి, జగన్నాథపురంలోని శ్మశానవాటిక నుంచి దాలిరాజు సూపర్ మార్కెట్ వరకు, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ నుంచి శ్రీనివాసనగర్ పాత పోస్టాఫీస్ వరకు, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ నుంచి శ్రీనివాసనగర్ ఆస్పత్రి వరకు, చెక్కుదురాయి బిల్డింగ్ వద్ద అనుబంధ రహదారుల్లో బీటీ రోడ్లు నిర్మించారు.

**ప్రజల అవసరాలకు ప్రాధాన్యం**

వెంకటేశ్వర కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆధునికీకరణ, రూ.36 లక్షల వ్యయంతో పైన అదనపు అంతస్తు నిర్మాణం జరుగుతోంది. రూ.33.50 లక్షలతో శ్రీనివాసనగర్ గెడ్డపై పాత బ్రిడ్జి స్థానంలో విశాలమైన కొత్త బ్రిడ్జి నిర్మిస్తున్నారు. నందరిగిరినగర్‌లోఓ డ్రెయిన్‌లను నిర్మించారు. శ్రీనివాసనగర్, నందగిరినగర్ ప్రాంతాలకు వాహనాల రాకపోకలకు వీలుకాక చాలా ఏళ్లుగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. శ్రీనివాసనగర్ బ్రిడ్జి విస్తరణ పనులు జరుగుతుండటంతో తమ సమస్యలు తీరుతాయని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వార్డులో ప్రజల అవసరాలను గుర్తించి దానికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం, ఇప్పటికే సుమారు రూ.2.5 కోట్లతో రహదారులు, డ్రెయిన్లు, బ్రిడ్జిలు, పార్కు, సామాజిక భవనాల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టాం. మరో రూ.1.23 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వాటిలో సుమారు రూ.48 లక్షలతో గోశీలపాలేనికి వెళ్లే మార్గంలో శిథిలావస్థలో ఉన్న కర్రివాని బ్రిడ్జి స్థానంలో క్రొత్తది నిర్మిస్తున్నాం. జగన్నాథపురం గెడ్డపై కొత్త బ్రిడ్జి నిర్మించే ఆలోచన ఉంది.

– పెద్దిశెట్టి ఉషశ్రీ, కార్పొరేటర్, 43వ వార్డు

# రాఖీ సందడి



పలు రకాల రాఖీలు



కంచరపాలెంలో రాఖీ స్టాల్ వద్ద మహిళలు

- జోరుగా రాఖీల విక్రయాలు
- కళకళలాడుతున్న దుకాణాలు

కంచరపాలెం: మార్కెట్లలో రాఖీ సందడి నెలకొంది. అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగ సమీపించింది. ఈ నెల 30, 31 తేదీల్లో రాఖీ పౌర్ణమి కావడంతో పండగ ఘనంగా జరుపుకునేందుకు అంతా సన్నద్ధమవుతున్నారు. కంచరపాలెం, తాటిచెట్లపాలెం, జ్ఞానాపురం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, ఇండస్ట్రియల్ ఎస్టేట్, మర్రిపాలెం తదితర ప్రాంతాల్లో రాఖీల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దూర ప్రాంతాల్లో ఉంటున్న సోదరులకు రాఖీలు పంపేందుకు ఇప్పటికే వాటిని కొని సిద్ధం చేశారు. ట్రెండ్‌కు తగ్గట్లు వివిధ రకాల రాఖీలు తయారు చేశారు. పెద్ద దుకాణాలతోపాటు ఫుట్‌పాత్, చిన్న చిన్న స్టాల్స్ వేసి వీటిని అమ్ముతున్నారు. ధరలు కూడా కాస్తా ఎక్కువగానే ఉన్నాయి. అన్ని చోట్ల రాఖీలతోపాటు మిఠాయి దుకాణాలు కళకళలాడుతున్నాయి.

# రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా ఎస్‌ఐలు, ధర్మేంద్ర, అప్పలరాజు

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో సీఐ సిహెచ్. సింహాద్రినాయుడు ఆదేశాల మేరకు ఆదివారం రౌడీషీటర్లకు ఎస్‌ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలు మాట్లాడుతూ రౌడీషీటర్ల దినచర్యపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. ఎవరు ఎక్కడికి వెళ్లిన తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వైన్ షాపులు, బార్‌ల వద్ద తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా ఉండాలని చెప్పారు. నేరాలకు జోలికి పోకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరానికి పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించారు.

# లక్ష్య సాధనకు నిరంతర కృషి



మాట్లాడుతున్న మోటివేషనల్ స్పీకర్ సునీత

మురళీనగర్: లక్ష్యం నిర్దేశించుకోవడంతోపాటు దాన్ని చేరుకోవడానికి నిరంతరం కృషి చేయాలని మోటివేషనల్ స్పీకర్ సునీతామూర్తి రామవరపు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో గైస్, ఐఎస్‌టీడీ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన 'విజయం వైపు పయనం' కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో రాణించాలంటే సబ్జెక్టుపై పట్టు సాధించడంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. సాంకేతిక విద్యను అభ్యసించే వారు తప్పనిసరిగా కంపెనీలకు అవసరమైన పరిజ్ఞానాన్ని సముపార్జించాలన్నారు. ప్రణాళికా బద్ధంగా చదవడం ముఖ్యమని పేర్కొన్నారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ వోఆర్‌ఎం రావ్, కాలేజీ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

# మూర్ఛపై అప్రమత్తత అవసరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ లావణ్య

మురళీనగర్: మూర్ఛ వ్యాధి విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని అపోలో ఆస్పత్రి న్యూరో ఫిజీషియన్, ఎపిలెప్సి నిపుణుడు డాక్టర్ పవన్‌కుమార్ రుద్రాభట్ల అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. మెదడులోని న్యూరాన్స్ మధ్య ఎలక్ట్రికల్ యాక్టివిటీ ఎక్కువగా ఉన్నప్పుడు మూర్ఛ వ్యాధి వస్తుందన్నారు. ఇది ఏ వయసులోనైనా రావచ్చని, ఈ వ్యాధి ఉన్నప్పటికీ సాధారణ జీవితాన్ని గడపవచ్చన్నారు. మందుల ద్వారా దీన్ని నివారించవచ్చని, కొంత మందికి సర్జరీ అవసరమవుతుందని పేర్కొన్నారు. కాళ్లు, చేతుల తిమ్మిర్లు, పక్షవాతం వంటి సమస్యల పరిష్కారంపై డాక్టర్ పవన్‌కుమార్ అవగాహన కల్పించారు.

**174 మందికి వైద్య పరీక్షలు**

డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ జి.లావణ్యల వైద్య బృందం 174 మందికి వైద్య పరీక్షలు చేశారు. సుగర్, బీపీతోపాటు నాడీ సంబంధిత వ్యాధులు, సాధారణ వ్యాధులపై పరీక్షలు చేసి వైద్య సలహాలు అందించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి లంకా వెంకట సుధాకర్ ఆధ్వర్యంలో పవన్‌కుమార్, లావణ్య, ఇతర వైద్య బృంద సభ్యులను ఘనంగా సత్కరించారు. క్లబ్ పూర్వాధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, కె.ద్వారకానాథ్, ఉపాధ్యక్షుడు ఆదిభట్ల రామకృష్ణ, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, కోశాధికారి జె.కూర్మారావు, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, కార్యవర్గ సభ్యులు వడ్డాది అప్పారావు, పి.చెల్వరాజు, ఎం.ఎ స్.ఆర్.మూర్తి, బి.సూర్యనారాయణ, ఆర్.నాగేశ్వరావు శిబిరం నిర్వహణకు సహకరించారు.

# ఎర్నిమాంబకు ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలోని ఎర్నిమాంబ ఆలయంలో ఆదివారం శ్రావణ మాస శుద్ధ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. దేవదాయ శాఖ ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్ శర్మ అమ్మవారికి ఉదయం నుంచి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు జరిపారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతోపాటు రూ.10, రూ.50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటావార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# శ్రావ్యంగా కచేరీ




కచేరీ చేస్తున్న సుభాని

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ నెలవారి కార్యక్రమంలో భాగంగా ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన ఒంగోలుకు చెందిన మాండోలిన్ విద్వాంసుడు ఎస్.సుభాని కచేరీ శ్రావ్యంగా సాగింది. ఈ కచేరీకి వయోలిన్ సహకారం విజయవాడకు చెందిన దుర్గా భవాని, మృదంగం సహకారం విజయనగరానికి చెందిన శ్రీమహదాసు ఏడుకొండలు, ఘటం సహకారం శ్రీకాకుళానికి చెందిన బంకుపల్లి దుర్గాప్రసాద్ అందించారు.

# 1 నుంచి 'శ్రీకృష్ణ కథా సప్తాహం'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తదితరులు

సీతంపేట: లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిచే సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు శ్రీకృష్ణ కథామృత సప్తాహ ప్రవచన కార్యక్రమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. లలితానగర్‌లోని పీఠం దర్బారు హాల్లో ఆదివారం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు స్వామివారు ప్రవచిస్తారని చెప్పారు.

ప్రతి రోజూ ముందుగా విష్ణు సహస్ర నామ పారాయణ, శ్రీకృష్ణ పూజ జరుగుతుందన్నారు. భక్తులు ఈ మహత్తర పారాయణ, ప్రవచన కార్యక్రమంలో పాల్గొని స్వామీజీ ఆశీర్వాదం పొందాలని కోరారు. నారాయణనంద భారతీస్వామి, చంద్రశేఖర్ మాస్టారు, సూర్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# 'స్కాలర్‌షిప్స్ ఇచ్చే స్థాయికి ఎదగాలి'



విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందిస్తున్న వెంకటేశ్వరరావు

బీచ్ రోడ్డు: ఉత్తమ ప్రతిభతో స్కాలర్‌షిప్స్ పొందుతున్న విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకుని స్కాలర్‌షిప్స్ ఇచ్చే స్థాయికి ఎదగాలని రోటరీ క్లబ్ కాబోయే గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో ఎల్ ఏంజెల్ ఇంటర్నేషనల్ వలంటీర్స్ అసోసియేషన్, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ సంయుక్తంగా 30 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం విశ్వగురు కావాలంటే నేటి తరం విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. మూడేళ్లుగా ప్రతి ఏటా పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ విశాఖ వ్యాలీ అధ్యక్షుడు పాండురంగరాజు, మండ జానకిరామ, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ మళ్లీ గెలవాలని పూజలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, శ్రీనివాస్ దంపతులు, కుటుంబ సభ్యులతో కలిసి ఒడిశాలోని ప్రసిద్ధ పూరి జగన్నాథ స్వామిని దర్శించుకున్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజారిటీతో మళ్లీ అధికారంలోకి రావాలని, డైనమిక్ లీడర్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు కార్పొరేటర్ దంపతులు తెలిపారు. ఉత్తర నియోజకవర్గంలో నిరంతరం ప్రజల్లో ఉండే నాయకుడు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ఎమ్మెల్యేగా గెలిచి మరింత ఎక్కువగా ప్రజలకు సేవ చేయాలని కూడా పూజలు చేసినట్లు చెప్పారు.

# సంప్రదాయాలకు ప్రతీకలు శాస్త్రీయ నృత్యాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి



భరతనాట్య నృత్య ప్రదర్శన

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- ఘనంగా భరతనాట్య కళాంజలి అకాడమీ వార్షికోత్సవం

మద్దిలపాలెం: మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు శాస్త్రీయ నృత్యాలని, వాటిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. గురజాడ కళా క్షేత్రంలో ఆదివారం భరతనాట్య కళాంజలి అకాడమీ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలను మేయర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భరతనాట్యం, కూచిపూడి నృత్యాలలో చిన్నారులకు ప్రావీణ్యం కల్పించడానికి కృషి చేయాలన్నారు. విద్యతో పాటు కళల్లో కూడా రాణించేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. అనంతరం భరతనాట్య కళాంజలి అకాడమీ విద్యార్థులు భరతనాట్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అకాడమీ ప్రిన్సిపాల్ సంతోషి విజయ్, విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కన్నం వెంకటరమణ, చెన్నై కళా క్షేత్రం ఆచార్యులు వసుంధర థామస్ పాల్గొన్నారు. అనంతరం కళాకారులకు మేయర్, అతిథులు బహుమతులు అందజేశారు.

# శ్రావణలక్ష్మీ నమోస్తుతే..

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు ఆదివారం నాటికి 11వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ఘనంగా ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్నివాల్

ఆనందపురం : హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మండలంలోని గంభీరంలో ఉన్న హరేకృష్ణ వైకుంఠ మందిరం నిర్మాణ ప్రదేశంలో సోమవారం నుంచి విద్యార్థులకు సాంస్కృతిక కార్నివాల్ నిర్వహించనున్నామని ఆ సంస్థ అధ్యక్షుడు భక్తదాస తెలిపారు. ఈ నెల 28న 1, 2 తరగతుల విద్యార్థులకు రంగులు వేసే పోటీలు, 29న ఉదయం 5, 6, 7 తరగతుల విద్యార్థులకు స్వర సంగీతంలో, మధ్యాహ్నం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గాత్ర సంగీతంలో, 31న ఉదయం 3, 4 తరగతుల విద్యార్థులకు కలరింగ్‌లో పోటీలు ఉంటాయని చెప్పారు. అలాగే సెప్టెంబర్ 1న ఉదయం 1, 2, 3, 4 తరగతుల విద్యార్థులకు గీతా శ్లోక పఠనం, మధ్యాహ్నం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పెయింటింగ్‌లో, 2న 5, 6, 7 తరగతుల విద్యార్థులకు గీతా శ్లోకపఠనం, 3న ఉదయం 1, 2, 3, 4 తరగతుల విద్యార్థులకు పౌరాణిక వస్త్ర అలంకరణపై, మధ్యాహ్నం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గీతా శ్లోక పఠనంపై పోటీలు ఉంటాయని వివరించారు. అన్ని పోటీలకు ప్రవేశం ఉచితమని, పాల్గొనే వారందరికీ ప్రశంసా పత్రాలు అందజేస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు ప్రతినిధి బలరామ్ కృష్ణను 91541 70108లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# స్వచ్ఛ విశాఖే లక్ష్యం

కొమ్మాది: స్వచ్ఛ విశాఖకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాగరతీర స్వచ్ఛత కార్యక్రమంలో ఆయన పాల్గొని బీచ్ తీరం వెంబడి ఉన్న వ్యర్థాలను తొలగించారు. నగరంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో నిషేధించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా తీరంలో 3.5 టన్నుల వ్యర్థాలు సేకరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సన్యాసిరావు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 500 మంది ఖైదీలకు వైద్య పరీక్షలు



ఖైదీలకు వైద్య సేవలు అందిస్తున్న ఏఎంసీ, డీవీఎల్ విభాగం వైద్య సిబ్బంది

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఆంధ్ర మెడికల్ కళాశాల(ఏఎంసీ) డీవీఎల్ విభాగం వైద్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇక్కడ ఖైదీలకు చర్మ వ్యాధులపై అవగాహన కల్పించారు. 500 మంది ఖైదీలకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి, వారిలో సుమారు 200 మందికి వివిధ రకాల మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ పి.గురుప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాత్, కారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిశోర్‌కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఉప పర్యవేక్షణాధికారి పి.ఎస్.రామచంద్రరావు, ఎస్.కమలాకర్, జైలు వైద్యురాలు ఈశ్వరిదేవి పాల్గొన్నారు.

# పోలీసుల అదుపులో నలుగురు యువకులు

సీతమ్మధార: గంజాయి సేవిస్తున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ నేతృత్వంలో నలుగురిని అదుపులోకి తీసుకొని ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. వివరాలిలా.. సీతంపేటకు చెందిన నలుగురు యువకులు సీతమ్మధారలోని రాధాకృష్ణ లేఅవుట్ ఎదురుగా గల కొండపై గంజాయి సేవిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. వారిని అదుపులోకి తీసుకుని ఫోర్త్ టౌన్ పీఎస్‌కు అప్పగించారు. నలుగురు యువకులు పోలీస్ట్ స్టేషన్‌లో ఉన్నారు.